క్లుప్తంగా

ప్రైవేటు బస్సుల వేగాన్ని నియంత్రించాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రైవేటు బస్సుల మితిమీరిన వేగాన్ని నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్ గురువారం డిమాండ్ చేశారు. గామన్ బ్రిడ్జిపై కాతేరు సమీపంలో బుధవారం రాత్రి కావేరి ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్ బోల్తా పడడం దురదృష్టకరమన్నారు. ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ ఘటనకు ప్రైవేట్ వాహనాల నిర్లక్ష్యం, మితిమీరిన వేగమే కారణమన్నారు. ఇటీవల ఆర్ట్స్ కాలేజీ వద్ద ప్రైవేట్ ట్రావెల్ వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారన్నారు. ఆ ఘటన మరువక ముందే మరో ఘోరం జరగడం బాధాకరమన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బియ్యం, కూరగాయల వితరణ



గుంటూరు పంపించే బియ్యం, కూరగాయలతో పాస్టర్ మహిమ రాజు

కడియం: గుంటూరులో ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో జరిగే బైబిలు మిషన్ 87వ మహోత్సవాలకు జేగురుపాడు బైబిలు మిషన్ సంఘం నుంచి బియ్యం, కూరగాయలు పంపించామని పాస్టర్ సాక మహిమ రాజు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో సంఘస్తులు, స్థానికులు పెద్ద ఎత్తున బియ్యం, కూరగాయలు వితరణ చేశారు. వాటిని జేగురుపాడు నుంచి గురువారం లారీలో పంపించారు. ఈ లారీని గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ జెండా ఊపి ప్రారంభించారు.

నేడు మెగా రక్తదాన శిబిరాలు

కంబాలచెరువు: అఖిల భారత కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా డ్రగ్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అఖిల భారత అధ్యక్షుడు జేఎస్ షిండే జన్మదినాన్ని పురస్కరించుకుని అన్ని రాష్ట్రాల్లోనూ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం సీతంపేటలోని సంఘ కార్యాలయంలో శిబిరం జరుగుతుందన్నారు. అసోసియేషన్ కార్యదర్శి పి.గణపతి, కోశాధికారి కె.శ్రీనివాస్, ఇతర కార్యవర్గ సభ్యుల పర్యవేక్షణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కోసం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు గోకవరం బస్టాండ్, శేషయ్యమెట్ట, దేవీచౌక్, లక్ష్మీవారపుపేట, కోర్టు ఏరియా, రామచంద్రరావుపేట, సాంబశివరావుపేట, కోర్లంపేట ప్రాంతాలకు విద్యుత్ ఉండదన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ డైరెక్టర్ శారద తదితరులు

కంబాలచెరువు: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో తయారు చేసిన కాలమాని పోస్టర్‌ను గురువారం ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద ఆవిష్కరించారు. త్వరలో నిర్వహించే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, పబ్లిక్ పరీక్షలలో అధ్యాపకులు చిత్తశుద్ధితో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఎస్ఎస్‌వీఎల్ నరసింహం, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అయినపర్తి మురళీకృష్ణ, కార్యదర్శి డి.మోహన్, ఉపాధ్యక్షుడు ఎస్.రాంబాబు, కోశాధికారి యు.వెంకట రమణ పాల్గొన్నారు.

గాయకుడు విజయ్ కుమార్‌కు సత్కారం



విజయ్ కుమార్‌ను సత్కరిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ గాయకుడు, గిటార్ విద్వాంసుడు తాళ్లూరి విజయ్ కుమార్‌ను జిత్ మోహన్ మిత్ర మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సత్కరించారు. జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై నట గాయకుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షతన త్కారం చేశారు. గురువారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముద్రదగ ఏసుబాబు, పోస్టల్ ప్రసాద్, పీవీఎస్ కృష్ణారావు, సోమరాజు నాయుడు పాల్గొన్నారు.

కోలుకున్న బాధితులు

- ఆస్పత్రిలో చికిత్స అనంతరం స్వస్థలాలకు చేరుకున్న క్షతగాత్రులు
- బస్సు బోల్తా ఘటనపై అధికారుల విచారణ
- ప్రమాద స్థలం పరిశీలన



ప్రమాదానికి గురైన బస్సు

కంబాలచెరువు: గామన్ వంతెనపై బుధవారం అర్ధరాత్రి కావేరీ ట్రావెల్ బస్సు బోల్తా పడిన సంఘటనలో గాయపడిన బాధితులు పూర్తిగా కోలుకున్నారు. ఘటనా స్థలంలో విశాఖపట్నానికి చెందిన హోమిని (20) మృతి చెందిన సంఘటన విదితమే. గాయపడిన 25 మంది క్షతగాత్రులను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, మరో నలుగురిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరు గురువారం సాయంత్రానికి పూర్తిగా కోలుకుని ఇళ్లకు వెళ్లిపోయినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

కారణమేమిటో..

ప్రమాదం జరిగిన ప్రాంతంలో రహదారి మరమ్మత్తు పనులు జరుగుతున్నాయి. ఆ సమయంలో వాహనాలను దారి మళ్లించేందుకు డైవర్షన్ బోర్డు పెట్టారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు వంతెన ఒక వైపు ఇరుకు రహదారిలోనే వాహనాలు రాకపోకలు సాగించాయి. మరమ్మత్తులు పూర్తయినా హైవే సిబ్బంది ఆ బోర్డులను తొలగించలేదు. దీంతో వాహనాలు ఆ దారిలోనే వెళ్లసాగాయి. అర్ధరాత్రి వేగంగా వస్తున్న కావేరి ట్రావెల్ బస్సును డ్రైవర్ ఈ డైవర్షన్ బోర్డును అకస్మాత్తుగా గమనించి మలుపు తిప్పాడు. వాహనం ఆ వేగానికి రోడ్డు పక్కనే ఉన్న గోతులోకి వెళ్లిపోయి రెండు సార్లు పల్టీ కొట్టిందని అధికారులు చెబుతున్నారు. హైవే అధికారులు రోడ్డు మరమ్మత్తులు అయిన వెంటనే ఆ డైవర్షన్‌ను తొలగించి ఉంటే ప్రమాదానికి ఆస్కారం ఉండేది కాదని స్థానికులు చెబుతున్నారు.



ప్రమాదస్థలంలో పాత్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌డీసీ ఎస్ఈ కుంతల్



ప్రమాదం జరిగిన వెంటనే ప్రయాణికులు బయటకు వచ్చిన అత్యవసరం ద్వారం

108 సిబ్బంది సేవలు

ప్రమాదం జరిగిన తర్వాత కొద్ది నిమిషాలకే అక్కడకు ఐదు 108 వాహనాల్లో వచ్చిన సిబ్బంది.. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడంలో కీలక పాత్రను పోషించారు. ప్రమాద స్థలంలోనే బాధితులకు ప్రాథమిక చికిత్స అందించి, ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రమాద సమయంలో వంతెనకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడిక్కడే స్తంభించాయి. అయినా చాకచక్యంగా సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను రక్షించడంలో 108 సిబ్బంది చూపిన చొరవను అందరూ అభినందించారు.



పాత్ కంపెనీ ప్రతినిధులు పెట్టిన స్టాప్‌బోర్డు

అధికారుల పర్యటన

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గామన్ రోడ్డులో బస్సు బోల్తా పడిన స్థలాన్ని గురువారం వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్.సురేష్, ఎంవీఐలు, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కుంతల్, ఈఈ రాజేంద్ర, రాజమహేంద్రవరం ఆర్‌డీవో కృష్ణ నాయక్ పరిశీలించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ప్రమాదం జరిగిన వెంటనే అక్కడకు వెళ్లారు. బ్రిడ్జి, రోడ్డును నిర్వహిస్తున్న పాత్ కంపెనీ ప్రతినిధులతో అధికారులతో మాట్లాడారు. రాత్రి సమయాల్లో రోడ్డు డైవర్షన్ పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సదరు పాత్ ప్రతినిధులు రాత్రి 8 గంటల వరకు పెట్టినట్లు చెబుతుండగా.. ప్రమాదం జరిగిన సమయంలో స్టాప్ బోర్డుతో రోడ్డుకు అడ్డుగా ఫైబర్ స్టాప్ బోర్డులు ఏర్పాటు చేసి ఉన్నట్లు ప్రమాద సమయంలో అక్కడున్న వారు వివరించారు. పాత్ కంపెనీ సిబ్బంది నిర్లక్ష్యంతో పాటు డ్రైవర్ మల్లేశ్వరరావు మద్యం మత్తులో ఉన్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు అధికారులు పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

హెచ్‌ఎం మంగారాణికి ఆహ్వానం



కంబాలచెరువు: నైతిక విలువలు, లింగ వివక్షత, రాజ్యాంగ విలువలు అంశంపై పాఠ్య పుస్తక రచనకు శ్రీకారం చుట్టేందుకు ఏర్పాటు చేసిన కార్యశాలలో పాల్గొనేందుకు నాగరాజా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని మోటూరి మంగారాణికి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆమె గురువారం వివరాలను వెల్లడించారు. విజయవాడలో శుక్ర, శనివారాల్లో జరిగే ఈ కార్యక్రమానికి హాజరుకావాలని పాఠశాల విద్యా డైరెక్టర్ విజయ రామరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా ఉత్తర్వులు పంపారు. ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు నేతృత్వంలో పాఠ్య పుస్తక రచనలో పాల్గొనే అవకాశం రావడం సంతోషంగా ఉందని మంగారాణి తెలిపారు. ఆమెను జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ఏఎంఓడీ గౌరీ శంకరరావు అభినందించారు.

141 మందికి ఉద్యోగాలు



నియామక పత్రాలతో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో గురువారం జరిగిన అమర్ రాజా కంపెనీ ఉద్యోగ మేళాకు 158 మంది విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించిన అనంతరం 141 మందికి ఎంపిక చేశారు. వారందరికీ నియామక పత్రాలు అందించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.రాధాకృష్ణన్ తెలిపారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో మంటలు

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు
- ప్రయాణికులు సురక్షితం
- రాజమహేంద్రవరం నుంచి బయలుదేరిన బస్సు
- ఏలూరు పాత బస్టాండ్ సమీపంలో ఘటన



బస్సులో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఏలూరు టౌన్ : ఏలూరు పాత బస్టాండ్ సమీపంలోకి వచ్చిన ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే అగ్ని కీలలు తీవ్రం కావటంతో బస్సులోని ప్రయాణికులందరూ తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏలూరు నగరంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రమాదం చోటుచేసుకోవటంతో పెను ప్రమాదం తప్పిందని, జాతీయ రహదారిపై రన్నింగ్‌లో మంటలు చెలరేగితే పెను విపత్తు జరిగేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికులను ఎక్కించుకుని రాజమహేంద్రవరంలో ప్రారంభమైన మార్నింగ్ స్టార్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఏలూరు పాత బస్టాండ్ వద్దకు వచ్చేసరికి బస్సు వెనుక పక్కన ఉన్న ఇంజిన్‌లో నుంచి మంటలు చెలరేగాయి. రాజమహేంద్రవరం నుంచి బెంగళూరు వెళ్లే ఏపీ 07 టీటీ 3333 నంబర్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఏలూరు చేరుకున్న తర్వాత ఈ ఘటన జరిగింది. వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. దీంతో ప్రయాణికులందరూ బయటకి వచ్చేశారు. ఏలూరు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వటంతో సంఘటనా స్థలానికి క్షణాల్లో చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఏవిధమైన నష్టం లేకుండా అగ్నిప్రమాదం నుంచి బయట పడడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉన్నారు. బ్యాటరీలో సాంకేతిక సమస్య కారణంగా మంటలు చెలరేగాయని భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పిన తర్వాత బస్సు యథావిధిగా ప్రయాణికులతో వెళ్లిపోయింది.

ముగిసిన గొంతేలమ్మ అమ్మవారి జాతర

రాజమహేంద్రవరం రూరల్: వెంకట నగరం గ్రామదేవత గొంతేలమ్మ జాతరోత్సవం నాలుగో రోజు గురువారం వైభవంగా ముగిసింది. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ లేబర్ కాంట్రాక్ట్ కో ఆపరేటివ్ సొసైటీ, ఆలయ కమిటీ సభ్యుల నేతృత్వంలో నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు గురువారం ఉదయం గొంతేలమ్మ అమ్మవారిని తప్పెటగుళ్లు, మాల మాస్టీల ప్రదర్శన, సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో గ్రామ వీధులలో ఊరేగించారు. అనంతరం అమ్మవారిని గోదావరిలో శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. లక్ష్మీ లేబర్ కాంట్రాక్ట్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడి సహదేవుడు, కొల్లపు సత్యనారాయణ, ఎస్సీఎఫ్ఎల్‌సీ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రాయుడు రామారావు, కొల్లపు సుబ్బారావు, కొత్తలంక ఎఫ్ఎల్‌సీ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బూసి పెద్ద అన్నవరం, మోతా అశోక్ కుమార్, సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారిని గోదావరిలో నిమజ్జనం చేసేందుకు తీసుకువెళుతున్న భక్తులు



జాతరలో ఆకట్టుకున్న తప్పెటగుళ్లు



మాలమాస్టీల ప్రదర్శన

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం



ఆకుకూరలు పంపిణీ చేస్తున్న ఉప సర్పంచ్ నాని, ఏసీడీపీవో కనకవల్లి

కడియం: ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయాలని కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని అన్నారు. కడియంలోని అంగన్ వాడీ కేంద్రం-1లో గురువారం పోషణ వాటిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటలను విధిగా పెంచాలని, వాటితో పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం సేంద్రియ విధానంలో పెంచిన తోటకూర, మెంతికూర, పాలకూర, చుక్కకూర, కొత్తమీరను గర్భిణులు, తల్లులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో కనకవల్లి మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ సూపర్ వైజర్ సత్యశ్రీ, జీఎంఎస్‌కే రాజేశ్వరి, ఏఎన్ఎం నిర్మల పాల్గొన్నారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ విజయ భాస్కర్



నూతన కార్యవర్గ సభ్యులు

కంబాలచెరువు: స్థానిక ఐఎంఏ హాలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఆ వివరాలను నిర్వాహకులు గురువారం విలేకరులకు తెలిపారు. ఐఎంఏ రాజమహేంద్రవరం అధ్యక్షుడిగా పిడుగు విజయ భాస్కర్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.రాజ శేఖర్, సెక్రటరీలుగా దాట్ల సతీష్, రఘు, అనసూరి ప్రియాంక, రవి కిరణ్, ధర్మతేజ, అరుణ్, సత్యప్రసాద్, శేఖర్ రెడ్డి, కోశాధికారిగా దుర్గాప్రసాద్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నారు. ఎన్నికలను డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ రామరాజు, డాక్టర్ వీరన్న చౌదరి పర్యవేక్షించారు.

భద్రతా ప్రమాణాలు పాటించండి

సీటీఆర్ఐ: రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు భద్రతా ప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఏవీ అప్పారావు రోడ్డులో గురువారం ఎన్‌సీసీ కేడెట్స్, రవాణా, పోలీసు తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన రహదారి భద్రతా మాసోత్సవాలు 2025 వాక్ థాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతి వేగంగా ప్రయాణించడం, హెల్మెట్ ధరించక పోవడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ సంపత్ కుమార్, ఎం.రవికుమార్, జి.రాంనారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో జరిగే జాతీయ గిరిజన సాంస్కృతిక మహోత్సవాల పోస్టర్‌ను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముడవత్ విష్ణునాయక్ పాల్గొన్నారు.



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు

ఆర్గానిక్ అరటి.. భలే రుచి



వేమగిరితోట పాఠశాలలో పండించిన అరటి గెలలు

కడియం: ఎరువులు క్రిమిసంహారక మందులు విపరీతంగా వాడుతున్న ఈ రోజుల్లో.. అవేమి వాడకుండా ప్రకృతి సిద్ధంగా అరటి చెట్టుకు కాసిన గెలలో ఒక్కో అత్తానికి 3 డజన్లకు పైగా కాయలు వచ్చాయి. వేమగిరి తోట -1 మండల పరిషత్ స్కూల్లో అరటి చెట్లకు పండిన గెలలను గురువారం కోశారు. వాటిలో ఒక అత్తానికి 40 పండ్లు, మరో దానికి 46 పండ్లు కాశాయి. పాఠశాలలోని బడితోటలో ప్రధానోపాధ్యాయుడు కె.జయరాజు, సహోపాధ్యాయులు శ్రద్ధతో పండించారు. కోసిన గెలలు మరింత ముగ్గిన తరువాత పిల్లలకు పంపిణీ చేస్తామన్నారు.

వైద్య సిబ్బంది సర్వే

సీతానగరం: లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌లో ఇప్పటికి 22,082 మందిని పరీక్షించగా వారిలో 86 అనుమానిత కేసులు గుర్తించామని, వారికి డాక్టర్లతో పరీక్షలు చేయించగా ఎవ్వరికీ లెప్రసీ నిర్ధారణ కాలేదని ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు తెలిపారు. రాజంపేటలో గురువారం నిర్వహించిన సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీహెచ్‌సీ వైద్యుడు ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో మండలంలో లెప్రసీ సర్వే వేగవంతంగా జరుగుతోందన్నారు. ప్రతి ఇంటిని వైద్య సిబ్బంది సందర్శించి, కుటుంబంలో సభ్యులందరినీ పరిశీలిస్తున్నారన్నారు. ఏమైనా అనుమానిత మచ్చలుంటే, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందిస్తున్నామన్నారు. మండలంలో ఒక్క కేసు కూడా నిర్ధారణ కాలేదని తెలిపారు.

అవినీతి ఆరోపణలపై అధికారుల విచారణ

ఆల్కాట్‌తోట: రాజమహేంద్రవరంలోని రోటరీ మహాకాళేశ్వర ఆలయంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై గురువారం దేవదాయశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఆలయ పూర్వపు అర్చకులు దేవులపల్లి కృష్ణశాస్త్రి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆమె ఆదేశాల మేరకు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ టీవీఎస్ఆర్ ప్రసాద్, సిబ్బందితో విచారణకు హాజరయ్యారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ పట్టపగలు వెంకటరావు, పూర్వపు అర్చకులు దేవులపల్లి కృష్ణశాస్త్రిని వేర్వేరుగా విచారించారు. విచారణకు వచ్చిన అధికారులు ఆలయంలోని ఉపాలయాలు, ప్రధాన శివలింగాన్ని సందర్శించారు. అనంతరం విచారణ చేపట్టారు. ఇరువురినీ విచారణ చేసిన అధికారులు.. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు. విచారణ అనంతరం దేవులపల్లి కృష్ణశాస్త్రి విలేకరులతో మాట్లాడుతూ దేవదాయశాఖ అధికారులు తీసుకురమ్మన్న ఎటువంటి రికార్డులు ఏమి లేకుండానే విచారణ పూర్తయిందని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆలయం తమ పరిధిలోకి రాదంటూ అధికారులు చెప్పడం విచారకరమన్నారు.



ఆలయంలో పట్టపగలు వెంకటరావుతో మాట్లాడుతున్న దేవదాయశాఖ అధికారులు

ప్రణాళికాబద్ధంగా రోడ్ల అభివృద్ధి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని ప్రధాన రహదారులకు రోడ్ డెవలప్‌మెంటు ప్లాన్‌ను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. దానవాయిపేట రోడ్డు, గోరక్షణపేట నుంచి ఏవీ అప్పారావు రోడ్డు డెవలప్‌మెంటు ప్లాన్‌లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు తయారు చేసిన రోడ్లలో తమ స్థలాలను స్వచ్ఛందంగా ఇచ్చిన వారికి టీడీఆర్ బాండ్లు ఇస్తామన్నారు. దానవాయిపేట జాగృతి బ్లడ్ బ్యాంకు రోడ్లలో టీడీఆర్ కోసం చేసిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 2027లో జరగనున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని నగరాభివృద్ధితో పాటు రోడ్ల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానర్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

సుభాష్ చంద్రబోస్ చిరస్మరణీయుడు

రాజమహేంద్రవరం సిటీ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు స్ఫూర్తిదాయకమని పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లంక సత్యనారాయణ అన్నారు. నేతాజీ జయంత్యుత్సవాన్ని గురువారం అన్నపూర్ణమ్మపేట బోసు బొమ్మ వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటంతోనే దేశానికి స్వాతంత్ర్యం వస్తుందని బోస్ నమ్మారన్నారు. పర్యావరణ పరిరక్షణ అవశ్యకతను తెలియచేస్తూ అటవీశాఖ సౌజన్యంతో అన్నపూర్ణమ్మపేటలో 300 మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి దేవత సుధాకర్, ఉపాధ్యక్షుడు గువ్వల వెంకటేశ్వరరావు,సంయుక్త కార్యదర్శి కింతాడ రమేష్ బాబు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: సుభాష్ చంద్రబోస్ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రూరల్ మండల అధ్యక్షుడు షేక్ సాజిద్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం పంచాయతీ కార్యాలయంలో ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద జయంతి వేడుక జరిపారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర విచ్చేశారు. కార్యక్రమంలో రూరల్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, నాయి బ్రాహ్మణ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పన్నాల వెంకటలక్ష్మీ సంతోషి, గుర్రాల వెంకట్రావు, యువ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కందుకూరి మనోజ్‌బాబు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో నేతాజీకి బీజేపీ నాయకుల నివాళి



మొక్కలు పంపిణీ చేస్తున్న లంక సత్యనారాయణ

కడియం: నేటి యువత నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి పాటుపడాలని మండల బీజేపీ అధ్యక్షుడు బొరుసు సుబ్రహ్మణ్యం, రాష్ట్ర తెలుగురైతు ప్రధాన కార్యదర్శి మార్గాని సత్యనారాయణ అన్నారు. కడియపులంకలోని సత్రం వద్ద సుభాష్ జయంతి వేడుకలు నిర్వహించారు.